క్లుప్తంగా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న లోవరాజు

సోంపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వి.లోవరాజు అన్నారు. జింకిభద్ర గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం శక్తియాప్ గురించి వివరించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సోంపేట: సోంపేట పట్టణంలోని సావిత్రి నర్సింగ్ హోమ్‌లో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మంటల నివారణకు వాడే సిలిండర్లను వినియోగించే విధానం, ఆకస్మాత్తుగా గుండె పోటు వచ్చేటప్పుడు గుండె పనితీరు పునరద్ధరణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి ఎ.వి.రామకృష్ణ, అగ్నిమాపక శాఖాధికారి సూర్యారావు, సిబ్బంది డి.భాస్కరరావు, సీహెచ్ విజయ్‌కుమార్, రామినాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

రైతుల సాధక బాధలు తెలిసిన వ్యక్తి కూర్మారావు



చైర్మన్ కూర్మారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: గ్రామీణ ప్రాంత రైతుల సాధక బాధలు తెలిసిన వంకల కూర్మారావును పలాస పీఏసీఎస్ చైర్మన్‌గా ఎంపిక చేసుకున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, రైతుల సమక్షంలో కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ కూర్మారావు మాట్లాడుతూ.. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. ఎమ్మెల్యే శిరీష, నాయకులు, అధికారులు కలిసి కార్యవర్గ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు లొడగల కామేశ్వరరావు, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, కొర్ల కన్నారావు, అంబటి కృష్ణమూర్తి, గురిటి సూర్యనారాయణ, లొద్దబద్ర నాయకులు శంకర్‌యాదవ్, బి.దేవరాజు, పిట్ట తాతారావు, జి.డిల్లేశ్వరరావు, ఎం.శివ, పి.వీరయ్య పాల్గొన్నారు.

వంచన చంద్రబాబు నైజం

ప్రజలను వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి..ఆ తరువాత వాటిని అమలు చేయకుండా దగా చేయడం ఆయనకు అలవాటేనని విమర్శించారు. బాబు మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమం ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో బుధవారం ఉత్సాహంగా జరిగింది. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. హామీలను అమలు చేయకపోవడంతో ఎంతో నష్టపోయారో తెలియజేశారు. కూటమి ప్రభుత్వ హామీలతో కూడిన క్యూఆర్‌కోడ్ పత్రాలను పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నందిగాం: దిమ్మిడిజోలలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి



కవిటి: ఆర్.కరాపాడు పంచాయతీ తోటవీధిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితరులు



కంచిలి: గోకర్ణపురంలో క్యూఆర్ కోడ్ పత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ నాయకులు



మందస: పీతాతోళిలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ శ్రేణులు



పలాస: లొత్తూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంతబొమ్మాళి: గోవిందపురంలో కూటమి సర్కార్ మోసాలను వివరిస్తున్న పార్టీ శ్రేణులు



కంచిలి: జె.శాసనాం కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు



వజ్రపుకొత్తూరు: అమలపాడులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ మండల ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, కార్యదర్శి గొరకల విశ్వనాథం, సర్పంచ్ దున్న రత్నం తదితరులు



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 13, 21 వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పట్టణ పార్టీ నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు



టెక్కలి: బన్నువాడలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి-నిమ్మాడలో పార్టీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ

ఆశ్రమ పాఠశాల సందర్శన



మందస మండలం కిల్లోయి కాలనీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంట,భోజన గదులు, ఆర్వోప్లాంట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, నీటి నిల్వలు లేకుండా జాగ్రత వహించాలని హెచ్‌ఎం మదన్‌మోహన్‌రావు, సిబ్బందికి సూచించారు. పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ ముఖలింగం, వార్డెన్ నారాయణ, ఉపాధ్యాయులు చంద్రమ్మ, ప్రభాకర్ ఉన్నారు. – మందస

స్వామిత్ర సర్వేపై శిక్షణ



స్వామిత్ర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆస్తులకు సంబంధించిన సమగ్ర సర్వే చేస్తున్నట్టు మండల తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీఓ కె.రామారావులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, రెవెన్యూశాఖ సిబ్బందికి స్వామిత్ర సర్వేపై బుధవారం శిక్షణ ఇచ్చారు. డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తూ చేపట్టే సర్వేలో నివాసయోగ్యమైన స్థలాలు, ప్రభుత్వ ఆస్తులను గుర్తించడం, పంచాయతీరాజ్, రెవెన్యూ, సర్వే ఆఫ్ ఇండియా విభాగాల మధ్య సమన్వయం పెంపొందించడం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కూన విష్ణుమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు ఉన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

విద్యార్థికి ఆర్థిక సహాయం



సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వడ్డితాండ్ర గ్రామానికి చెందిన మండల వేణు బోన్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు రూ. 25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమవంతు సాయంగా రూ. 12,100 సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న చేతులు మీదుగా విద్యార్థికు బుధవారం అందజేశారు. ఉపాధ్యాయ సిబ్బంది భాస్కరరావు, తిరుపతిరావు, జె.శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, బి.శ్రీనివాస్, అన్నాజీ, నాగేశ్వరరావు, శారదాంబ, లక్ష్మీనారాయణ, మురళీధరరాజు పాల్గొన్నారు. – సంతబొమ్మాళి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సోంపేట: వరి పంటను వెద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కాశీబుగ్గ: పలాస పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంఘ నాయకులు కోరారు. అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీ మోహన్, కమిషనర్ జయచంద్రలు హాజరై 2019 నుంచి ఇప్పటి వరకు ఐఏఎల్ఏలో ఏ పనులు చేశారు, ఎంత ఖర్చు అయింది, ఎంత మిగిలింది తదితర అంశాలపై చర్చించారు. ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, ఉపాధ్యక్షులు తాళాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

- పలాస జూనియర్ సివిల్ జడ్జి మాధురి



మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి, అధ్యక్షులు మండల న్యాయ సేవా సంఘం పలాస యూ.మాధురి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మానవ అక్రమ రవాణా చాలా భయంకరమైనదని.. ఈ విషయంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ కారణాలతో బాలబాలికలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. అంతేకాకుండా ఇతర దేశాలలో పని చేస్తున్న మహిళలు పట్ల చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని.. కొన్ని సందర్భాల్లో మానవ అవయవాలను రవాణా చేసి లబ్ధి పొందుతున్నారన్నారు. ఇది చాలా అమానుషమన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజ్, ఏజీపీ పిండి వెంకట్రావు, యవ్వరి హేమ కుమార్, కోత రజినికుమార్, చంద్రశేఖర్ శ్యాంసుందర్, చిట్టిబాబు, బి కృష్ణారావు, రవికుమార్, సూపరింటెండెంట్ కృష్ణ, ఏఎస్ఐ గోవిందరావు, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ధర్మారావు పాల్గొన్నారు.

పురుగు మందులు అధికంగా వాడొద్దు

కంచిలి: రసాయనిక పురుగు మందులను అధికంగా వాడొద్దని మండల వ్యవసాయాధికారి కె.సురేష్ పేర్కొన్నారు. జలంత్రకోట, మఠంసరియాపల్లి పంచాయతీ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పురుగు మందులు మోతాదుకు మించి వాడటం వలన కలిగే దుష్ప్రయోజనాలను రైతులకువివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, అన్వేష్ పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగపరచుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: వరి సాగులో మూస ధోరణికి స్వస్తి పలుకుతూ రైతులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ ఉప సంచాలకులు టి.భవానీశంకర్ అన్నారు. బిర్లంగిలో రైతులకు డ్రోన్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఒక ఎకరానికి మందు పిచికారీ చేసేందుకు కేవలం పది నిమిషాల సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి. అజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు పావని, సాయి చరణ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు టెక్కలి ఈఈ ఇ.నరసింహకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, సరియాపల్లి, దంత, కురుడు, రామేశ్వరం, చిన్నసాన పంచాయతీ పరిధిలో సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నాయకుల పరామర్శ

సోంపేట: మండలంలోని పాత్రకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బాక అప్పన్న ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బుధవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, పార్టీ నాయకులు మర్ల శంకరరావు, గోకర్ల ధర్మారావు, ప్రకాశరావు, భాస్కరరావు, వైకుంఠరావు, లోకనాథం, ప్రసాద్ ఉన్నారు.

మాంసం వ్యర్థాలను నిర్దేశించిన చోటే వేయాలి



చికెన్ దుకాణాల యజమానులతో సమావేశమైన అధికారులు

ఇచ్ఛాపురం టౌన్: చికెన్, మటన్ వ్యర్థాలను మున్సిపల్ అధికారులు నిర్దేశించిన ప్రదేశాలలోనే వేయాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్ అన్నారు. స్థాయిక జూనియర్ కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో చికెన్, మటన్ దుకాణాల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కొంతమంది చికెన్, మటన్ దుకాణదారులు మాసం వ్యర్థాలను బాహుదా నది వంతెన సమీపంలో పారబోస్తున్నట్టు చెప్పారు. మున్సిపాలిటీ వారు నిర్దేశించే ప్రదేశాల్లోనే వేయాలని ఆదేశించారు. ఆవులను రోడ్లపై విడిచి పెడుతున్నారని వాటి యజమానులను హెచ్చరించారు. రోడ్లపై ఆవులు విడిచి పెడితే చర్యలు తీసుకుంటామని మైక్‌లో ప్రచారం చేయించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్ కోసం పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం: పట్టణంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి సుడా ఎస్ఈ సుగుణాకర్ పరిశీలించారు. పట్టణ సందరీకరణలో భాగంగా సెంటర్ లైటింగ్ డివైడర్ ప్రదేశంలో ఏర్పాటకు పరిశీలించిన వివరాలు ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఏఈ జగదీష్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

కాశీబుగ్గ: సమస్యల పరిష్కారం కోరుతూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీ చార్జి చేయడాన్ని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్మిక సంఘం ఖండించింది. లాఠీ చార్జికి నిరసనగా బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కె.వెంకట్, ఎస్.శంకర్ మాట్లాడుతూ వర్క్ కాంటాక్ట్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. దీన్ని నేరమన్నట్టు కక్ష సాధింపు చర్యలు చేపట్టి పోలీసులతో ప్రభుత్వం కార్మికులను కొట్టించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో కె.ఈశ్వరరావు, భాస్కరరావు, బి.కుర్మారావు, కె.బాలకృష్ణ, సావిత్రి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, బ్రాహ్మణతర్ల, బ్రాహ్మణవీధి, పండఠానసం గ్రామ నివాసి చిత్తరంజనం సాహు గారి భార్య గాయత్రి సాహు మరియు జగన్నాథకాలనీ పానపోస్ బస్తీ, రఘునాథపల్లి పోస్టు, సుందర్‌ఘడ్ జిల్లా, ఒడిస్సా రాష్ట్ర నివాసి రమేష్ చంద్ర సాహు భార్య సచిత సాహు జన ఇరువురు ఇచ్చిన భోగట్టాపై ఈ పబ్లిక్ నోటీస్ ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

పై తెలిపిన నా క్లయింటులకు మరియు వారి సోదరుడు రుద్రప్రసాద్ పాడి తండ్రి గారైన రఘునాథ ప్రసాద్ పాడి తేది: 04-07-2024 లో చనిపోయినారు. వారి తండ్రి గారైన రఘునాథ ప్రసాద్ పాడి నా క్లయింట్లకు వారి సోదరుడు రుద్రప్రసాద్ పాడికి సమిష్ఠ కుటుంబ ఆస్తులు బ్రాహ్మణతర్లలో మరియు ఇతర ప్రాంతాలలో ఉన్నవి. నా క్లయింటుల సోదరుడు రుద్రప్రసాద్ పాడి దిగువన ఉదహరించిన షెడ్యూల్ ఆస్తులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నా క్లయింటులకు అన్యాయం తలపెట్టి దురుద్దేశంతో వేరేవారికి అమ్మివేయుటకు ప్రయత్నించుచున్నారని యాదీగా తెలిసినది. ACT 39-2005 హిందు వారసత్వ చట్టం ప్రకారం నా క్లయింటులకు మరియు వారి తండ్రి, వారి సోదరుడు అందరుకు సమాన భాగస్వామ్యులై ఉన్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తులు ఎవరికైనా ఏవిధమైన లావాదేవీలు అనగా అగ్రిమెంట్లు గాని, తనఖా గాని, క్రయచీటీ గాని కట్టినను నా క్లయింటులకు బైండింగ్ కావు మరియు చెల్లనేరవు. షెడ్యూలు దాఖలా ఆస్తులు అన్నియూ బ్రాహ్మణతర్ల చెకుబందీలు కలవు. మరియు వాటి సర్వే నెంబర్లు విస్తీర్ణం కూడా ఈ షెడ్యూల్‌లో పొందుపరిచియున్నాము. సర్వే నెంబరు 75/39లో ఒక ఎకరా 1.17 సెంట్లు మెట్టు భూమి, 75/30లో 10 సెంట్లు మెట్టు భూమి, సర్వే నెంబరు 83/1, 83/3ఏ, 83/3బి ఆస్తులు వెరశి విస్తీర్ణం Ac. 3.35 సెంట్లు పల్లపు భూమి మరియు బ్రాహ్మణతర్ల మార్కెట్‌లో డోర్ నెంబరు 3-213, సర్వే నెంబరు 56/3లో 260 చ॥అ॥ దుకాణం కలదు. మరియు ఆర్‌సిసి హౌస్ తూర్పు-పశ్చిమలకు 42 అడుగులు, ఉత్తర-దక్షిణలకు 116.66 అడుగులు అనగా 4900 చ॥అ॥ దాని డోర్ నెంబరు 2-401, సర్వే నెంబరు 56/3 మరియు ఆర్‌సిసి హౌస్ 572 చ॥అ॥ దాని సర్వే నెంబరు 56/3, డోర్ నెంబరు 2-450 పైన ఉదహరించిన ఆస్తులన్నీ సమిష్ఠ కుటుంబ ఆస్తులు.

పి.జి.రాజారత్నం, న్యాయవాది, BA, BL
కాశీబుగ్గ, ఓంశాంతి నగర్. సెల్: 9985827526